www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

శుక్రవారం

21 మార్చి 2025

విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు
జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను.
తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు..
సమకాలీన రజకీయాలు, సామాజిక
అంశలపై అవగాహన ఉండి..
రియగల వారికి 'కలంజ్యోతి'
సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003





## దండకారణ్యంలో
# కాల్పుల మోత!

### ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- భద్రత బలగాలకు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు
- 30 మంది నక్సలైట్ల మృతి, ఒక జవాను మృతి
- భారీగా ఆయుధాలు స్వాధీనం
- మృతదేహాలను గుర్తించే పనిలో పోలీస్ అధికారులు
- 2025లో 71 మంది నక్సల్స్ హతం

2లో

- దళితులను, బీసీలను క్యాబినెట్ నుంచి తీసేస్తే పాలనపై పట్టు చిక్కినట్టా!?
- రోజుకు 18 గంటలు పని చేస్తుంటే నాకు పట్టు రాలేదట!
- అడ్డగోలుగా సంపాదించిన డబ్బుతో సర్కారుపై దుష్ప్రచారం
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ ధ్వజం
- 588 మందికి కారుణ్య.. 334 మందికి కొలువు పత్రాలు

2లో




# పంచుకు తింటే.. పట్టు వచ్చినట్లా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


2
కలంజ్యోతి
శుక్రవారం 21.03.2025 General News



# దండకారణ్యంలో కాల్పుల మోత!

**రాయ్‌పూర్ :** తెలంగాణకు సరిహద్దున ఉన్న ఛత్తీస్ గడ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో మరోసారి భీకర కాల్పుల మోత మోగింది. భద్రత బలగాలకు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో 30 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు బస్తర్ ఐజి సుందర్ రాజు ఇప్పటికే వెల్లడిరచారు.అలాగే కాంకేర్ జిల్లా కోరస్ కోడ్ గ్రామంలో కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రత బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. భద్రత బలగాలు ఎదురు కాల్పులు జరుపడంతో 4 మావోయిస్టులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే ఛత్తీస్ గడ్ రాష్ట్రంలోని దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని గంగలూరు, అంద్రి దండకారణ్యంలో మావోయిస్టులు ఉన్నారనే పక్కా సమాచారంతో బుధవారం సాయంత్రం భద్రత బలగాలు దండకారణ్యంలోకి వెళ్ళారు. ఇది గమనించిన మావోయిస్టులు భద్రత బలగాలపై ఒక్కసారిగా కాల్పుల మోత మోగించారు. ప్రతిఘటించిన భద్రత బలగాలు కాల్పులు ప్రారంభించడంతో ఆ ప్రాంతంలో 26 మంది మావోయిస్టులు మృత్యువాత పడ్డారు. అలాగే కాంకేర్ జిల్లా కోరస్ కోడ్ గ్రామంలో కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రత బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. భద్రత బలగాలు ఎదురు కాల్పులు జరుపడంతో 4 మావోయిస్టులు మృతి చెందారు. మొత్తం గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులు దండకారణ్యంలో ఉన్నారనే విషయం తెలుసుకుని గురువారం ఉదయం నుండే భద్రత బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. 30 మంది మావోయిస్టులతో పాటు మావోయిస్టుల కాల్పుల్లో డిఆరిజి జవాన్ రాజు మరణించారు. ఆ ప్రాంతంలో ఇంకా కూంబింగ్ జరుగుతూనే ఉంది. మృతి చెందిన మావోయిస్టుల కోసం భద్రత బలగాలు వెతుకుతున్నాయి. 30 మంది మావోయిస్టుల మృతదేహాలను భద్రత బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. వీరిని గుర్తించే పనిలో పోలీస్ ఉన్నాతాధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది.

మృతి చెందిన వారిలో అగ్రనేతలు ఉన్నారనే సమాచారం తెలుస్తుంది. మృత దేహాల వద్ద భారీ మొత్తంలో ఆటో మెటిక్ ఆయుధాలు మందుగుండు సామాగ్రితో పాటు విప్లవ సాహిత్యాల పుస్తకాలు లభించినట్లు ఐజి తెలిపారు. బీజాపూర్, దంతెవాడ, కాంకేర్ దండకారణ్యంలోకి భద్రత బలగాలు డిఆర్, స్పెషల్ టాక్స్‌ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేసినట్లు తెలుస్తుంది. ఇప్పటికే 2025 జనవరి నుండి మార్చి వరకు సుమారు 100కు పైగా మావోయిస్టులు మృత్యువాత పడ్డారు. అలాగే 2024లో భద్రత బలగాల చేతిలో సుమారు 220 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తుంది. ఇప్పటికే కేంద్ర హోంశాఖ 2026 నాటికి మావోయిస్టు పార్టీని సమూళంగా అంతమొందిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో తరచూ మావోయిస్టులకు ఎదురు దెబ్బ తగులుతూనే ఉంది.








# పంచుకు తింటే.. పట్టు వచ్చినట్లా?

## సీఎం రేవంత్ రెడ్డి

**కలంజ్యోతి, హైదరాబాద్ :** ‘రేవంత్ రెడ్డికి పాలనలో పట్టు రాలేదని అంటున్నారు. దళితుడు రాజయ్యను, బలహీన వర్గాలకు చెందిన ఈటల రాజేందర్‌ను మంత్రివర్గం నుంచి తప్పిస్తే పట్టు వచ్చినట్లా!? వాళ్లను తీసేయడానికి సహేతుకమైన కారణం చెప్పి ఉంటే నీకు పట్టు ఉన్నట్లు! తప్పు చేసిన నీ సొంత మనుషులను అయినా లోపల వేయిస్తే పట్టు వచ్చినట్లు!? అంతే తప్ప.. పంచుకు తింటే పట్టు వచ్చినట్లా!?’ అంటూ మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్లు సచివాలయానికే రాని వ్యక్తికి పాలనపై పట్టు వచ్చిందని అంటున్నారని, ప్రతి రోజూ 18 గంటలు పని చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్న తనకు పట్టు రాలేదని అంటున్నారని విమర్శించారు. అప్పుడూ ఇప్పుడూ అధికారులు వాళ్లేనని, వ్యవస్థ కూడా అదేనని, మారింది కేవలం 11 మంది మంత్రులు మాత్రమేనని తెలిపారు. అప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ తదితరులు ఉంటే.. ఇప్పుడు రేవంత్, సీతక్క, భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు తదితరులు ఉన్నారని చెప్పారు. మరి మేం ఎక్కడ విఫలమయ్యామని నిలదీశారు. ‘కొలువుల పండుగ’ పేరిట రవీంద్ర భారతిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖలో 588 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. అదేవిధంగా పురపాలక శాఖ, మిషన్ భగీరథ విభాగాల్లో పలు ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను అందజేశారు. ‘బిల్డ్ నౌ’ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు. ‘నేను రాజకీయాల్లోకి వచ్చి 20 ఏళ్లు దాటింది. సీఎం అయ్యారు కాదా మారాలంటున్నారు. హుందాగా వ్యవహరించాలంటున్నారు. నేను హుందాగా వ్యవహరిస్తే.. అర్థం చేసుకునే వాళ్లు ఉండాలి కదా..?’ అని వ్యాఖ్యానించారు. జానారెడ్డి పెద్ద మనిషిలా హుందాగా వ్యవహరించారని, దృతరాష్ట్ర కౌగిలితో కేసీఆర్ ఆయన గౌరవాన్ని మంటగలిపారని ఆరోపించారు. మీ పాలనలో కోదండరామ్ తలుపులు పగులగొట్టించారని, మీలాగే మేం కూడా పోలీసులను ఆదేశిస్తే.. ఇళ్లలో నుంచి బయటకు రానీయకుండా తాళమేసి ఒంగోబెట్టి దంచరా? అని ప్రశ్నించారు. కేటీఆర్ తలుపులు పగులగొట్టి వీపులు వలగ దంచరా? అని మండిపడ్డారు. ‘పోలీసులకు మీరు చెప్పారు. నేను చెప్పలేదు. అలాంటి విధానానికి మేం వ్యతిరేకం. గడీల్లో దొరల్లాగా పెరగకపోవచ్చు. మాకు మానవత్వం ఉంది. మీకు అది లేదు. నేను విజ్ఞతను ప్రదర్శిస్తున్నా. అది మీరు చూపలేదు. మీకు మాకు అదే తేడా’ అని స్పష్టం చేశారు.

**ప్రజలకు నాపై కోపమెందుకు?**

తనపై అన్ని వర్గాల ప్రజలు కోపంగా ఉన్నారని ప్రచారం చేస్తున్నారని, రుణ మాఫీ చేసినందుకు రైతులు, ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించినందుకు ఆడబిడ్డలు, 57 వేల ఉద్యోగాలు కల్పించినందుకు నిరుద్యోగులు కోపంగా ఉన్నారా అని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. ఎస్‌హెచ్‌జీ సంఘాలకు ఆర్టీసీ బస్సులు, సోలార్ విద్యుదుత్పత్తి కాంట్రాక్టు ఇస్తున్నందుకు కోపంగా ఉంటారా? అని ప్రశ్నించారు. అడ్డగోలుగా సంపాదించారని, ఆ డబ్బుతో ఇప్పుడు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నల్ల ధనాన్ని వాట్సాప్ వర్సిటీలో పెట్టుబడిగా పెట్టి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అందాల పోటీలు హైదరాబాద్‌లో ఎందుకని ఒకాయన అంటున్నారని, ఆయన బాధ అర్థం కావడం లేదు కానీ.. హైదరాబాద్‌కు, పర్యాటక రంగానికి ఇది అందివచ్చిన అవకాశమని చెప్పారు. 140 దేశాలకు చెందిన ప్రతినిధులు, 3000 చానళ్లు, పత్రికల ప్రతినిధులు రానున్నారని, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తారని, తద్వారా, ప్రపంచంలోనే హైదరాబాద్ ల్యాండ్ మార్క్ కానుందని స్పష్టం చేశారు. ఇంత మంచి సందర్భం వస్తే అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం తగదని అన్నారు. “ఫార్ములా ఈ రేస్ ముసుగులో ప్రభుత్వ డబ్బులు కొల్లగొట్టావ్ సామీ.. ఉద్యమం ముసుగులో ఉన్నదంతా ఊడ్చుకుపోయే ఆలోచనలో మీరున్నారు. ప్రజాకోణంలో వారి సమస్యలు పరిష్కరించాలన్న ఆలోచనలో నేనున్నా. మీకు, నాకు తేడా ఇదే” అని వ్యాఖ్యానించారు.

# మానాలలో బస్సు పునః ప్రారంభం

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని మానాల గ్రామంలో పల్లెవెలుగు బస్సును ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, మండల నాయకులతో కలిసి మానాల స్టేజీ నుంచి తక్కలపెల్లి వరకు ఎమ్మెల్సీ వెంకట్, ఎమ్మెల్యే సత్యం ప్రయాణించారు. కార్యక్రమంలో దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, అంజిరెడ్డి, కొండబత్తిని అనిల్, బాలే శ్రీనివాస్, హరినాథ్, కోరేపు వెంకటేష్, శ్రీనివాస్, బెజ్జంకి నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



# మహిళా సంఘాలే బ్రాండ్ అంబాసిడర్లు

## నిర్మల్ కలెక్టర్ అభిలాష



**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా మహిళా స్వయం సహాయక సంఘాలు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రశంసలు పొందుతున్నారని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఆమె ఉద్బోధించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు నేడు తమ స్వయం కృషితో అన్ని రంగాలలో రాణించ గలుగుతున్నారన్నారు. నిర్మల్ జిల్లా స్వయం సహాయక సంఘాలకు జాతీయస్థాయిలో అనేక అవార్డులు లభించాయని, ఇది ఎంతో గర్వకారణమైన విషయమని తెలిపారు. జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలబెట్టినందుకుగాను డిఆర్డిఓ విజయలక్ష్మి, మహిళా సంఘాలకు అభినందనలు తెలియజేశారు. ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతూ, భవిష్యత్తులో స్వయం సహాయక సంఘాలు మరిన్ని అవార్డులు, ప్రోత్సాహకాలు సాధించాలని ఆకాంక్షించారు. నిర్మల్ జిల్లాకు మహిళా సంఘాలే బ్రాండ్ అంబాసిడర్లని కొనియాడారు. నిర్మల్ కొయ్య బొమ్మలను భావితరాలకు అందించేందుకు కొయ్య బొమ్మల తయారీలో వినియోగించే పొనికి కర్రలను ఉత్పత్తి చేయడానికి సమాఖ్య ఆధ్వర్యంలో పొనికి వనాలు పెంచడం అభినందనీయం అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయని తెలిపారు. పథకాలన్నింటినీ మహిళలు సద్వినియోగపరుచుకొని వ్యాపారం, స్వయం ఉపాధి ఏర్పరచుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లా స్వయం సంఘాలు బ్యాంకు లింకేజీ, రుణ వితరణ, తదితర అంశాలలో అగ్రగామిగా ఉందన్నారు. మితిమీరిన ఎరువులు వాడి పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా నేడు ఎన్నో రకాల వ్యాధులకు గురవుతున్నామని తెలిపారు. సాంప్రదాయ పంటలు, సాంప్రదాయ ఆహారపు అలవాట్ల వైపు మళ్లే విధంగా మహిళా సమాఖ్య సంఘాలు అడుగులు వేయాలన్నారు. దీనికోసమే జిల్లాలో ప్రత్యేకంగా నాణ్యమైన విత్తనాలను సేకరించి, పరీక్షలు జరిపి మండలాల వారిగా మహిళా సంఘాలకు విత్తనాలను అందజేసి విత్తన నిధులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విత్తన నిధికి సంబంధించి పోస్టర్ ను కలెక్టర్, అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. మహిళల తో కలిసి కేక్ ను కోసి మహిళలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, డిఆర్డిఓ విజయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య సంఘం అధ్యక్షురాలు గంగామణి, మహిళ సమాఖ్య సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ గా పరమేశ్వర్

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా ప్రభుత్వ పరీక్ష సహాయక కమి షనర్ గా ముడారపు పరమేశ్వర్ గురువారం నాడు పదవి బాధ్య తలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సోమవారం పేటలో గజిటెడ్ హెచ్ఎం గా విధులు ని ర్వహిస్తున్నారు. ఇంతవరకు ఏసీజీఇ గా పనిచేసిన పద్మ ఇటీవల ఆ పదవికి రాజీనామా చేయడంతో ఈ పోస్టు ఖాళీ ఏర్పడింది. దీనితో నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం నిర్మల్ జిల్లా వి ద్యాధికారి పి.రామారావు పరమేశ్వర్ ను ప్రభుత్వ పరీక్షల సహా యక కమీషనర్ గా నియమిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించా రు. ఈ సందర్భంగా పరమేశ్వర్ ను జిల్లా విద్యాధికారి మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

# క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** పాఠశాల, కళాశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణ ఎస్ కేఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025,వన్ నేషన్ వన్ ఎలెక్షన్ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, అదనపు కలెక్టర్ బి ఎస్ లత పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిభ గల క్రీడా కారులకు కొదవలేదని, ఎంతో మంది జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. ప్రతి విభాగంలో గెలుపు ఓటములు సహజం, ప్రతి విషయంలో ఒక్కొక్కరికి ఒక్కో ఆలోచన ఉంటుందన్నారు. రాష్ట్రం, దేశం ప్రయోజనాల నిమిత్తం ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి. నేడు విద్యార్థులు ముందుకు వచ్చి వికసిత భారత్ యూత్ పార్లమెంట్ లో పాల్గొనడం అభినందనీయం..గెలుపు ఓటములు సహజం పాల్గొనడం ప్రధానమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత ఆలోచనలు చేసి గొప్ప స్థాయికి ఎదగాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చిరంజీవి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టివి సూర్యం, ప్రిన్సిపాల్ అశోక్, నాయకులు గిరి నాగభూషణం, అడువల లక్ష్మణ్, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ తోట మల్లికార్జున్, చెట్ పల్లి సుధాకర్, శరత్ రావు, రంగు మహేష్, ప్రవీణ్ రావు, క్రాంతి పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇండ్లతో పేద ప్రజల్లో ఆనందం

## నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గురువారం భూమిపూజ చేసి ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే దొంతి మాట్లాడుతూ ఇల్లు లేని అర్హులైన ప్రతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందకూడదని సూచించారు. ఎస్సీ, ఎస్టీ లకు ఇంటి నిర్మాణానికి రూ.6లక్షలు, బీసీ ఇతర, ఇతర సామాజిక వర్గాలకు రూ.5 లక్షలు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, పెండెం రామనంద్, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, నెక్కొండ మండల అధ్యక్షుడు భక్తి అశోక్, పట్టణ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, మాజీ సర్పంచ్ శ్రీధర్, చందు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సోమారంపేట గ్రామంలో శాలివాహన సంఘం మండల ఉపాధ్యక్షుడు మూడపల్లి వంశీ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పదిలో సాధించిన మార్కులు ఉన్నత విద్యకు ఎంతో దోహదపడుతాయన్నారు.



# మృతుల కుటుంబాలకు బెంద్రం పరామర్శ

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలలోని దాచారాం గ్రామంలో బంటూ నర్సయ్య, ఇల్లంతకుంటలో కాసుపాక పోచయ్య, వెల్జీపూర్ లో కోనేటి ఎల్లయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుస్తుకున్న బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతి రెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబాలకు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా బెంద్రం మాట్లాడుతూ పేద ప్రజలకు ఏ కష్టం వచ్చినా.. ఆపదొచ్చిన ఎల్లపుడూ తాము అండగా ఉంటామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఫౌండేషన్ సేవా ప్రాతినిధులు బొల్లారం ప్రసన్న, చిట్యాల శ్రీనివాస్, ఎల్లెంకి శ్రీనివాస్, ఉప్పుల జీవన్ రెడ్డి, దండవేణి రజనీకాంత్, కాసుపాక సురేష్, కాసుపక కిషన్, కాసుపాక దుర్గయ్య, కుమ్మరవేణి మహేందర్, సూదుల కిషన్, గజ్జల శ్రీనివాస్, కేశవేణి భూమెష్, ఉప్పల చంద్రారెడ్డి, గుడ దేవరాజు, బంటు రవి, గజ్జల పాల్గొన్నారు.




# ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలి

## నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** పదో తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం పదో తరగతి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి బోర్డు పరీక్షలను ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలకు సంబంధించి ఎవరైనా తప్పుడు సమాచారాన్ని, పుకార్లను వ్యాప్తి చేస్తే సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలకు సంబంధించి ఎవరికైనా ఎలాంటి సందేహాలున్నా ఎస్ఎస్ సీ కంట్రోల్ రూమ్ నంబరు 90599 87730 ను సంప్రదించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమాచారం విద్యార్థులకు వివరంగా తెలియజేయాలన్నారు. అన్ని పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈఓ పి.రామారావు, విద్యాశాఖ అధికారులు ఎం.పరమేశ్వర్, పద్మ, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం టెలి కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లు, విద్యాశాఖ అధికారులతో పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు, నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. పలు పాఠశాలలు, కేజీబీవీలకు చెందిన విద్యార్థులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జూమ్ కాల్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. దిగ్విజయంగా పరీక్షలు రాయాలని విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆల్ ది బెస్ట్ స్టూడెంట్స్

## మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి




**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు నాగర్ కర్నూల్ మాజీ శాసనసభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి శుభాశీస్సులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఈ సంవత్సరం కష్టపడి చదివారు.. మీ కష్టం వృథా కాదు.. మీ భవిష్యత్తు పునాది పదవ తరగతే.. ఇష్టపడి.. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి.. ఉత్తమ ఫలితాలు సాధించి మీ అమ్మ నాన్నల ఆశయాలను నెరవేరుస్తారని ఆశిస్తున్నాను. మీరు విజేతలుగా నిలిచి మీ ఊరికి, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మీరంతా ఏకాగ్రతతో పరీక్షలు రాసి అద్భుతమైన ఫలితాలు సాధించాలని కోరుతూ శుభాశీస్సులు' అని తెలిపారు.

# సజావుగా పరీక్షలు నిర్వహించాలి

## రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

### 10వ తరగతి పరీక్షల నిర్వహణ పై రివ్యూ





**కలంజ్యోతి, జగిత్యాల :** తెలంగాణ రాష్ట్రంలో 10వ తరగతి పరీక్షలను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సజావుగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు. గురువారం రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా హైదరాబాద్ నుంచి పదవ తరగతి పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాల తరలింపు సమయంలో తప్పనిసరిగా బందోబస్తు ఉండాలన్నారు. ఎక్కడ ఎటువంటి లీకేజీలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగే 10వ తరగతి పరీక్షల షెడ్యూల్ ఉందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అంతరాయం ఉండొద్దన్నారు. విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో తాగునీరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లు పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లాలో 10వ పరీక్షలకు 11,865 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, వీరి కోసం 67 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పరీక్షల నిర్వహించే సిబ్బంది, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్లకు శిక్షణ అందించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాము, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు




**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండల పరిధిలో జరిగే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద మార్చి 21 శుక్రవారం నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షల సమయంలో సెక్షన్ (163 బీఎన్ఎస్ఎస్) భారతీయ నాగరిక్ సురక్షా సంహిత అమలులో ఉంటుందని ఎస్సై సాయిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఇద్దరికి మించి గుంపులుగా ఉండొద్దని సూచించారు. కేంద్రాల వద్ద ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల పరిసరాలలోని ఇంటర్నెట్, జిరాక్స్ షాపులు, మూసివేయాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సీఎం రేవంత్ రెడ్డికి మాదిగలంతా రుణపడి ఉంటాం

## దుండిగల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది సురేష్

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంలో దుండిగల్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతకింది సురేష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న మాదిగలకు సీఎం రేవంత్ రెడ్డి చేసిన మేలును మాదిగలంతా ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. 30 సంవత్సరాల పోరాట ఫలితమే ఈరోజు ఎస్సీ వర్గీకరణ. కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికి మాదిగలంతా మద్దతుగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్, మేడ్చల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు సదానందం, దుండిగల్ మున్సిపాలిటీ ఓబీసీల అధ్యక్షులు కుమార్ యాదవ్, విజయ్ గౌడ్, పరశురాం గౌడ్, రాహుల్, ధర్మారెడ్డి, చెవిటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.







# నిరంతరాయంగా సహాయక చర్యలు

## ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద ఉన్నతాధికారుల సమీక్ష

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్బీసీ) టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలపై ఆర్మీ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అజయ్ మిశ్రా, డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని దోమలపెంట, ఎస్ఎల్బీసీ ఇన్లెట్ -1 ఆఫీస్ వద్ద నిర్వహించిన సమీక్షా సమావేశంలో సహాయక బృందాల ఉన్నతాధికారులతో, టన్నెల్ లోపల ప్రమాద ప్రదేశంలో జరుగుతున్న సహాయక చర్యలపై, తీసుకోవాల్సిన భద్రత ప్రమాణాలను విశ్లేషించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. టన్నెల్ లోపల పరిస్థితులను అనుసరించి భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు వివరించారు. టన్నెల్ ప్రమాద ప్రదేశంలో సహాయక పనులకు ఆటంకంగా ఉన్న ఊట నీటిని అధిక సామర్థ్యం గల పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్లు తెలిపారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారుల సూచనలను పాటిస్తూ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు చేపడుతున్న బృందాలను నిరంతరం అప్రమత్తంగా ఉంచుతున్నట్లు తెలిపారు. సహాయక చర్యలు ప్రతి రోజు 5 షిఫ్టులుగా కొనసాగుతున్నాయని, ఉదయం 7 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 7 గంటలకు, 11 గంటల షిఫ్టుల్లో, ప్రత్యేక సహాయక బృందాలు నిరంతరాయంగా పనిచేయిస్తున్నారని వివరించారు. టన్నెల్ లోపల జరిగే సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమీక్షలో ఆర్మీ అధికారులు, కల్నల్ సురేష్, కల్నల్ పరీక్షిత్ మెహర, వికాస్ సింగ్ ఎన్డీఆర్ఎఫ్ అధికారులు డాక్టర్ హరీష్, జీఎస్ఐ అధికారులు తప్లీయాల్, భట్టాచార్య, శైలేంద్ర, లక్ష్మణ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ర్యాట్ హోల్ మైనర్స్, అన్వి రోబోటిక్స్ , కడావర్ డాగ్ స్క్వాడ్, జేపీ, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి
# బియ్యం అందజేత

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని కొప్పూరు గ్రామం గంగిరెద్దుల కాలనీకి చెందిన గంట రాజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబం ఆర్థిక పరిస్థితిని స్థానిక యువజన కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్, వసంత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ది వెంకటనారాయణ గౌడ్ 50 కిలోల బియ్యం మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు తనవంతు సహాయం చేస్తూ, నిరుపేదలకు అండగా నిలుస్తున్న పెద్ది వెంకట్ నారాయణగౌడ్ ఎల్లవేళలా ముందు వరుసలో ఉంటారన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు జక్కుల అనిల్ యాదవ్, వల్లపు మహేందర్, చిట్కూరి అనిల్, తాళ్ల ప్రవీణ్, సీనియర్ నాయకులు గద్ద ఐలయ్య, కోహెడ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కలంజ్యోతి, మల్యాల:** మండలంలోని కొండగట్టు గిరి ప్రదక్షిణ నడక దారి అభివృద్ధి పనులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మొహినొద్దీన్, మౌనిక, ప్రవీణ్, రత్నమ్మ, ఆనంద్, వసీం, పిరోధ్, మహేందర్, నాగరాజ్ వీరి సమక్షంలో పనులు ప్రారంభించారు. అనంతరం సత్యం మాట్లాడుతూ.. కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, నిధులు కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, రాంలింగారెడ్డి, ఆనంద్ రెడ్డి, బాలే శ్రీను, కొండబత్తిని అనిల్, రామాంజనేయులు, హరినాథ్, మల్లేశం, సాయి, సంజీవ్, తిరుపతి పాల్గొన్నారు.



# మ్యాంగో మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** రూరల్ చల్‌గల్ మ్యాంగో మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం జగిత్యాల చల్గల్ మార్కెట్ యార్డు లో రూ.1 కోటి 70 లక్షలతో నిర్మిస్తున్న ఫ్లాట్ ఫామ్ ను పరిశీలించి పనులు నాణ్యతగా జరిగేలా చూడాలన్నారు. మామిడి మార్కెట్ సీజన్ వస్తున్న సందర్భంగా మార్కెట్ లో రైతులకు, వ్యాపారులకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రూ. 1 కోటి రూపాయలతో సీసీ రోడ్లు, మరుగుదొడ్లు నిర్మాణం మార్కెట్ అభివృద్ధికి ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నమన్నారు. రూ.7 కోట్లతో మ్యంగో మార్కెట్ లో షెడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు గత కాంగ్రెస్ హయం లో 1974 లో చల్ గల్ వాలంతరీ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 1 కోటి 70 లక్షలతో రైతులు ధాన్యం ఆరబెట్టడానికి ఫ్లాట్ ఫామ్ నిర్మాణం, రెండవ సారి అవకాశం కల్పించిన రైతులకు మార్కెట్ లను అభివృద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు దామోదర్ రావు, రాధ రవీందర్ రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, సురేందర్ రావు, బాలా ముకుందం, మహేశ్వర్ రావు, గిరినాగభూషణం, అదువల లక్ష్మణ్, జగిత్యాల మండల, పట్టణ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో
# ఆనంద దినోత్సవం

**కలంజ్యోతి, జగిత్యాల :** తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆనంద దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సంఘం జిల్లా కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు 70 వ జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. అనంతరం సీనియర్ సిటిజన్ రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్ కుమార్ మాట్లాడుతూ మనిషి జీవిత పరమార్థం ఆనందంగా జీవించడమేనన్నారు. సీనియర్ సిటిజన్స్ నిన్నటి గురించి చింతించడం, రేపటి గురించి ఆలోచించడం మానివేసి నేటిని ఆస్వాదించడమే ఆనందానికి అసలైన మార్గమని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, పెన్షనర్ల జిల్లా సహాయ అధ్యక్షుడు పి.సి.హన్మంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.డి.యాకూబ్, ధర్మపురి అధ్యక్షుడు కండ్లే గంగాధర్, కార్యదర్శి దుబ్బేశం, మెట్ పల్లి కోశాధికారి వి.ప్రభాకర్ రావు, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం, జగిత్యాల డివిజన్ అధ్యక్షుడు బి. రాజేశ్వర్, మహిళా నేతలు రాధ, జలజ, నాయకులు సత్యనారాయణ, దేవేందర్ రావు, నారాయణ, మారుతీరావు, సామ సత్యమ్ రావు, గడ్డమీది మారుతి పాల్గొన్నారు.



ప్రశ్నించే గొంతుగా

## ఎమ్మెల్సీ కవిత

### మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్

**కలంజ్యోతి, జగిత్యాల :** బీసీ హక్కుల కోసం ప్రశ్నించే గొంతుగా నిలిచిన కల్వకుంట్ల కవిత, బీసీ బిల్లుకై శాసన మండలిలో గళం ఎత్తి, రెండు వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టాలని ప్రభుత్వంతో పోరాడి విజయం సాధించారని మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. తెలంగాణ రుద్రమదేవి చాకలి ఐలమ్మ, బీసీ బంధు ,బహుజన బందు కల్వకుంట్ల కవిత చిత్రపటానికి రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి జెడ్పీ చైర్ పర్సన్ పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒకే బిల్లు పెట్టి చేతులు దులుపుకునే ప్రభుత్వ ప్రయత్నాలను ఎండగడుతూ రెండు బిల్లులు పెట్టాల్సిందే నని డిమాండ్ చేసి సాధించిన ఘనత ఎమ్మెల్సీ కవిత కు దక్కుతుందన్నారు. బీసీ బిల్లును స్వాగతిస్తున్నాము కానీ రాష్ట్రంలో బీసీలల్లో ఎన్ని కులాల్లో ఎంతమంది ఉన్నారనేది కూడా స్పష్టత ఇవ్వాలని డిమండ్ చేశారు. ముందునుంచి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, ఫ్యాక్స్ చైర్మన్ రాజలింగం, మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, సాగర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాణి, సాయి, మాజీ ఎంపీటీసీ మోర వెంకటేష్, నాయకులు ప్రశాంత్, పడాల సత్యం, సాయిరెడ్డి, రాజేశం, గంగాధర్, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూర్ బస్టాండ్ సమీపంలో గురువారం సాయంత్రం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిలో ఒకరు మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన యువకుడు కాగా మరొకరు హనుమకొండ వాసి అని తెలుస్తుంది. గాయపడిన యువకుల్లో ఒకరిని అంబులెన్స్ 108 ద్వారా వరంగల్ ఎంజీఎం కు తరలించగా మరో యువకున్ని స్థానిక ఆస్పత్రిలో చేర్చారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## అంజన్న సేవలో జబర్దస్త్ షో కమెడియన్ నవీన్

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని గురువారం జబర్దస్త్ షో కమెడియన్ నవీన్ దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు.






## ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** సూరారం డివిజన్ షాపూర్ నగర్ ప్రధాన రహదారిలోని ఎం.జె గార్డెన్స్ లో గురువారం బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'దావత్ ఏ ఇఫ్తార్' కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక అని అన్నారు. మతాలకతీతంగా ఇతరులు ఇఫ్తార్ విందులో పాల్గొనడం సోదరభావాన్ని పెంచి లౌకిక విలువలను కాపాడుతాయి. అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూర తినిపిస్తూ ఉపవాసాన్ని విరమింపజేశారు. కార్యక్రమంలో పలు డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతి నిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, మతపెద్దలు, మైనార్టీ నాయకులు, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.




## ఇండియా వచ్చి ఎంతో నేర్చుకున్నా..

### విశ్వ సుందరి క్రిస్టినా



**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఇండియా మనకు చాలా నేర్పుతుందని, ప్రతి విషయంలో స్ఫూర్తినిస్తుందని విశ్వ సుందరి క్రిస్టినా తెలిపారు. 2024 మిస్ వరల్డ్ గా తన ప్రస్థానం ఇండియాతో మొదలైందన్నారు. ఆ సమయంలో తాను ఎంతో నేర్చుకున్నానని చెప్పారు. హైదరాబాద్ వేదికగా జరగనున్న 72 వ మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో అధికారులు గురువారం బేగంపేట్ టూరిజం ప్లాజాలో ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన క్రిస్టినా మాట్లాడారు. తెలంగాణలో చాలా దేవాలయాలను సందర్శించినట్లు చెప్పారు. ఇక్కడి దేవాలయాలు గొప్ప విలువలు నేర్పుతాయన్నారు. ఇక ఇండియాలో ఒక స్పిరిట్ ఉందని, వివిధ మతాల వారు.. వివిధ భాషల వారు కలిసి జీవిస్తున్నారని కొనియాడారు. ఇక్కడ ట్రెడిషన్ కూడా చాలా బాగా నచ్చిందని, ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు. అనంతర్యం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. రాష్ట్ర ఆదాయం పెంచి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేయడం నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే మిస్ వరల్డ్ పోటీల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. మేలో హైదరాబాద్ వేదికగా 72వ మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.







# 23న ఎస్ఎఫ్ఐ ఆత్మీయ సమ్మేళనం

**కలంజ్యోతి, హన్మకొండ :**
భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)లో 1970 నుంచి 2025 వరకు క్రియాశీలకంగా పనిచేసిన విద్యార్థి నాయకులు, కార్యకర్తలు ఈనెల 23న భగత్ సింగ్ వర్ధంతి రోజు హనుమకొండలోనికాళోజీ కళాక్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఆసంఘం పూర్వ నాయకులు తెలిపారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ అభ్యుదయ రచయిత గోరేటి వెంకన్న, ఎస్ఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎస్.వీరయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యార్థి ఉద్యమానికి నేతృత్వం వహించిన అనేక మంది హాజరుకానున్నట్లు తెలిపారు. గడిచిన 55 సంవత్సరాలలో ఎస్ఎఫ్ఐలో పనిచేసిన విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు.

**ఘనమైన చరిత్ర ఎస్ఎఫ్ఐది..**

ఈ సందర్భంగా పూర్వ నాయకులు మాట్లాడుతూ '1970 సంవత్సరంలో దేశంలో శాస్త్రీయ విద్యావిధానం కోసం, బ్రిటీష్ పాలన నుంచి వారసత్వంగా వచ్చిన మెకాలే విద్యావిధానాన్ని తిరస్కరించి మాతృభాషలో విద్యా విధానాన్ని తీసుకురావాలని, లౌకిక విలువలతోకూడిన విద్యా వ్యవస్థ ఉండాలని, దేశంలోని ప్రజలందరికీ ఒకే రకమైన కామన్ విద్యా విధానం కావాలని, చదువుకున్న వారికి ఉపాధి అవకాశాలు ఉండే రీతిలో దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలనే మహత్తరమైన ఆలోచనలతో ఎస్ఎఫ్ఐ ఏర్పడినట్లు గుర్తుచేశారు. సంఘం ఏర్పడి నాటినుంచి పై లక్ష్యాల కోసం అనేక చరిత్రత్మకమైన పోరాటాలను నిర్వహించింది. విద్యార్థులలో ప్రజాస్వామ్య భావజాలం, నాయకత్వ లక్ష్యానాలను పెంపొందించడానికి వీలుగా విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ ఉద్యమించింది. దేశంలో ప్రతిష్టాత్మకమైన జేఎన్‌యూ, హెచ్‌సీయూ, జాదవ్‌పూర్ యూనివర్సిటి, ఢిల్లీ అంబేద్కర్ యూనివర్సిటీ లాంటి అనేక ప్రముఖ యూనివర్సిటీలలో విద్యార్థి సంఘాలతో నేతృత్వం వహిస్తున్నది. అనేక మందిని దేశం గర్వించే రీతిలో దేశ నాయకులుగా తీర్చిదిద్దిన ఘనమైన చరిత్ర ఎస్ఎఫ్ఐకి ఉన్నది. దేశంలో గడిచిన కాలంలో అనేక విచ్చిన్నకర, ఏర్పాటు ఉద్యమాలు తలెత్తిన సందర్భంలో ఎస్ఎఫ్ఐ దేశ ఐక్యత, సమగ్రత కోసం నిలబడింది. మాదేహం ముక్కలైన దేశాన్ని ముక్కలు కానివ్వం ! అంటూ వందలాది మంది ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన చరిత్ర ఎస్ఎఫ్ఐది. అధ్యయనం, పోరాటం బాటలో పురోగమిస్తున్నది. సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యల పరిష్కారం కోసం, యూనివర్సిటలలో డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా పోరాడింది. పాఠశాలలకు పక్కా భవనాల కోసం పోరాడి సాధించిన ఘనత ఎస్ఎఫ్ఐది. ఇలాంటి పోరాటాల చరిత్ర కలిగిన ఎస్ఎఫ్ఐ యువతకు మార్గదర్శిగా ఉన్న భగత్‌సింగ్ వర్ధంతి రోజున ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడం సముచితమని భావిస్తున్నాము. అందరు ఈ సమ్మేళనంలో పాలుపంచుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్ఎఫ్ఐకి నాయకత్వం వహించిన వారందరి తరపున విజ్ఞప్తి చేస్తున్నాం' అని తెలిపారు.

## సమ్మేళనం జయప్రదం చేయాలి

ప్రస్తుతం దేశంలో నెలకొన్న అశాంతి పరిస్థితులు, రోజురోజుకూ దిగజారిపోతున్న మానవ విలువలు, లౌకికతత్వం, ప్రజాస్వామ్య వాతావరణం లాంటి నేపథ్యంలో గడిచిన 55 సంవత్సరాలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన వారందరిని మరోమారు ఎస్ఎఫ్ఐ ఆశయాలను పునరుచ్చరణ చేసుకొని భవిష్యత్‌లో పురోగమన విధానాల వైపునకు నేటి విద్యా వ్యవస్థ, విద్యార్థులను కార్యోన్ముకులను చేయడం కోసం ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు పూర్వ నాయకులు తెలిపారు. పూర్వ నాయకులు, క్రియాశీల కార్యకర్తలు పాల్గొని సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శులు సారంపల్లి వాసుదేవరెడ్డి, టీ ఉప్పలయ్య, రాగుల రమేష్, మెరుగు అశోక్, గానుగుపాటి గంగాధర్ రెడ్డి, బిరెడ్డి సాంబశివ, దుగ్గెల తిరుపతి, మాజీ నగర కార్యదర్శులు గడ్డం రవి, బండి పర్వతాలు, మాజీ నగర అధ్యక్షులు ఎం హరికిషన్ పాల్గొన్నారు.



# సూర్య45 మూవీలో హీరోయిన్ ఫిక్స్

కోలీవుడ్ స్టార్ సూర్య బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. షూటింగ్స్ లో పాల్గొనడంతో పాటుగా సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటున్నారు. ప్రస్తుతం సూర్య 'రెట్రో' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పూజా హెగ్డే నటిస్తుండగా.. ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సూర్య ఈ మూవీతో పాటు 'సూర్య-45'సినిమాలోనూ నటిస్తున్నారు. ఆర్ జే బాలాజీ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్స్ పిక్చర్స్ పై ప్రభు, ప్రకాష్ బాబు నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన తప్ప ఎలాంటి అప్డేట్ రాలేదు. తాజాగా, సూర్య-45 మూవీకి సంబంధించిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమం దీపావళికి జరగనున్నట్లు టాక్. అయితే ఇందులో సూర్య సరసన స్టార్ హీరోయిన్ త్రిష హీరోయిన్ గా నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన టీజర్ ను మేకర్స్ ఏప్రిల్ 14కు తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది. సూర్య-45 చిత్రాన్ని జూన్‌లో విడుదల చేసే ప్లాన్‌లో చిత్రబృందం ఉన్నట్లు టాక్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది ఇక అది చూసిన వారంతా సూర్య 45 హిట్ అవడం ఖాయమని అంటున్నారు.



